క్లుప్తంగా

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

మధిర: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుడుముల విజయభాస్కర్ రెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతీ పేద కుటుంబానికి వంద రోజులు పాటు ఉపాధి హామీ పథకం ద్వారా వేతనంతో కూడిన పని కల్పిస్తుందన్నారు. కూలీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కూలీలకు చేసిన పనికి వెంటనే తమ ఖాతాలో నగదు జమవుతుందన్నారు.

కొణిజర్ల వాసికి అవార్డు


అవార్డు అందుకుంటున్న రామకోటయ్య

కొణిజర్ల: కొణిజర్లకు చెందిన మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చల్లా రామకోటయ్యకు అవార్డు లభించింది. మానవ హక్కుల పరిరక్షణ సమితి ద్వారా ఆయన నిర్వహిస్తున్న కార్యక్రమాలకు గాను గోవాలో జరిగిన సమావేశంలో కన్నతల్లి ఫౌండేషన్ బాధ్యులకు అవార్డు అందజేసి సన్మానించారు. కన్నతల్లి ఫౌండేషన్ అధ్యక్షుడు కె,.రాజన్ బాబుతో పాటు కె.శ్రీనివాస్, డాక్టర్ జి.నరేష్, ఉన్నం జ్ఞానసుందరి, చలమాల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ప్రభుత్వ ఫలాలు అందడమే లక్ష్యం

తల్లాడ: ప్రభుత్వ ఫలాలు ప్రతీ పేదవాడికి అందడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ తల్లాడ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు అన్నారు. తల్లాడ మండలం బాలపేట, మంగాపురం గ్రామాల్లో సోమవారం జరిగిన బీజేపీ వీధి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ వివిధ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ దేశాన్ని అగ్రగామిగా నిలిపారని అన్నారు. మోదీ పాలన తెలంగాణాలో కూడా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి గాదెకృష్ణారావు, నాగేశ్వర్‌రావు, చిట్టెం మోహన్‌రావు, పాలెపు నరసింహారావు పాల్గొన్నారు.

3న సర్వసభ్య సమావేశం

మధిర: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మార్చి 3న ఎంపీపీ మెండెం లలిత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను తక్షణమే అందజేయాలని సూచించారు.

ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న దాతలు

బోనకల్: మండలంలోని మోటమర్రి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వర్కర్ కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం హెచ్ఎం శ్రీనివాసరావు తన స్నేహితులతో రూ.20 వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వలస కార్మికులకు కూరగాయలు వితరణ


కూరగాయలు అందజేస్తున్న సుధారాణి

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి ఇటుకబట్టీల వద్ద పని చేస్తున్న ఒడిసా కార్మికులకు సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి సోమవారం కూరగాయలు వితరణగా అందించారు. ఈ మేరకు కార్మికులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

యాచకురాలు మృతి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బస్టాండ్‌లో గత కొంత కాలంగా ఉంటూ యాచకురాలుగా జీవిస్తున్న వృద్ధురాలు(80) సోమవారం మృతి చెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెరిగిన మక్కల సాగు..

- ఎకరానికి రూ.30 వేల ఆదాయం
- 480 ఎకరాల్లో మొక్కజొన్న


కంకి దశలో ఉన్న మొక్కజొన్న


జన్నారంలో సాగు చేస్తున్న మొక్కజొన్న

ఏన్కూరు: అధిక పెట్టుబడులు పెట్టి వాణిజ్య పంటలు సాగు చేసి వైరస్ సోకడంతో దిగుబడులు రాక అప్పులు పాలవుతున్న రైతులు తక్కువ పెట్టుబడులు, తక్కువ శ్రమ, తక్కువ కాలంలో దిగుబడులు వచ్చే మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మొక్కజొన్న సాగు రైతులు ఆశజనకంగా ఉన్నారు. గతేడాది 282 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఈ ఏడాది 480 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని మేడేపల్లి, ఏన్కూరు, జన్నారం, భగవాన్‌నాయక్ తండా, హిమామ్‌నగర్ తండా, అక్కినాపురంతండా, నాచారం, తిమ్మారావుపేట, మూల పోచారం, రాయమాదారం, ఆరికాయలపాడు, కేసుపల్లి, తూతకలింగన్నపేట గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మొక్కజొన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు. ఎకరానికి రూ.25 వేల పెట్టుబడులు అవుతున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటా రూ.1,600 వరకు ధర పలుకుతోంది. దిగుబడులు ఎకరానికి 30 క్వింటాళ్ల నుండి 35 క్వింటాళ్ల వరకు వస్తున్నాయి. పెట్టుబడులు పోను ఎకరానికి రూ 30 వేల వరకు ఆదాయం వస్తుండంతో రైతులు ఈ సాగు చేస్తున్నారు. పంట కూడా 110 రోజుల్లో చేతికోస్తుండడంతో మొక్కజొన్న సాగుపై దృష్టి సారిస్తున్నారు. రైతులు పత్తిపంట చేతికొచ్చిన తరువాత అది తీసివేసి దాని స్థానంలో రబీసాగు కింద మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మండలంలో ఏడాది ఏడాదికి మొక్కజొన్న సాగు ఇంకా పెరగనుంది.

సాగు ఆశాజనకంగా ఉంది



నాలుగున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసాను. రూ.1లక్ష 15 వేల వరకు పెట్టుబడులు అయ్యాయి. ప్రస్తుతం మొక్కజొన్న చేతికోచ్చే దశకు చేరింది. గత ఏడాది రెండు ఎకరాల్లో సాగు చేసాను. ఎకరానికి రూ 30 వేల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఆశాజనకంగానే ఉంది.

– భూక్య మంజీలాల్, రైతు, గార్లఒడ్డు

పెరుగుతున్న సాగు



మండలంలో మొక్కజొన్న సాగు పెరుగుతుంది. గత ఏడాది 282 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసారు. ఈ ఏడాది 480 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసారు. పత్తికి జనవరిలో పురుగు ప్రభావం ఎక్కువ ఉంటుంది. పత్తి తీసివేసి అపరాల పంటకాని మొక్కజొన్న కాని వేసుకోవాలి.

– బాలకృష్ణ ఏఈఓ, బురదరాఘువాపురం

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి


మహాసభను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కే.ఖాదర్‌బాబా అధ్యక్షతన సోమవారం జరిగిన డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు అనంతోజు రాఘవచార్యులు, భవానీశంకర్‌ను సత్కరించగా, డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రింట్ మీడియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నిమ్మగడ్డ శ్రీకాంత్, భాస్కర్‌రావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.సతీష్, రామకృష్ణతో పాటు కార్యవర్గాలు ఎన్నికయ్యాయి. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావుతో పాటు సైదులు, జి.శ్రీనివాసరెడ్డి, ఎస్.వెంకట్రావు, మోహిద్దీన్, మాధవ్, పురుషోత్తం, బీ.వీ.రామారావు, దేవా, శ్రీకాంత్, గురవయ్య, సతీష్, మునీర్, పాషా, రాంబాబు, కెంపురాజు పాల్గొన్నారు.

వైభవోపేతంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న భక్తులు, అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్ద గోపవరం గ్రామంలోని పురాతన శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయ (శివాలయం) నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, శాంతి కల్యాణం జరిపించారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పలువురు ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించారు.

టైలర్స్ డేను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలో మంగళవారం నిర్వహించే టైలర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల, పట్టణ అధ్యక్షులు ఎండీ.యాసీర్, మదీనాపాషా కోరారు. స్థానిక కళాభారతిలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీఎస్ చారి, టిప్‌టాప్ వెంకటేశ్వరరావు, కోటా సత్యనారాయణ, లాల్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని పేరుపల్లికి చెందిన బిచ్చాలు ఇంట్లో జరిగిన స్వల్ప వివాదంతో క్షణికావేశానికి లోనైన ఆయన పురుగులు మందు తాగాడు. కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

అంతర్జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక


హర్షిత్‌ను అభినందిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని టాలెంట్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న ధారవత్ హర్షిత్ కరాటే డూ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీలలో ప్రతిభ చూపాడు. కటా విభాగంలో బంగారు పథకం, సర్టిఫికెట్ సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హర్షిత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ పులి అరుణ, కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు.

మెటీరియల్ పంపిణీ


మెటీరియల్‌తో విద్యార్థులు

వైరారూరల్: మండలంలోని గన్నవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు సోమవారం మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కూరకుల సైదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని అన్ని వర్గాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రీతి మృతికి నిరసనగా సోమవారం పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజలు సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతి చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించి కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు



కారేపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ముదిగొండలో..


మధిర: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


ఏన్కూరు: మాట్లాడుతున్న బాణోతు విజయభాయి


కల్లూరు: సమావేశంలో నాయకులు, విద్యార్థులు


తల్లాడ: నిరసన తెలుపుతున్న నాయకులు

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ కమల్‌రాజ్

బోనకల్: కంటివెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద కుటుంబాలకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. కంటివెలుగు శిబిరంలో వైద్యులు అందుబాటులో ఉండి పరీక్షలు చేసిన అనంతరం వారికి అవసరమైన కంటి అద్దాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల రవీందర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో మొదటిస్థానం


అవార్డులతో వైరా లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్‌కు దారా రీజియన్ మీట్‌లో 5 అవార్డులు లభించాయి. రీజియన్ చైర్మన్ దారా శ్రీనివాసరావు చేతుల మీదుగా వైరా లయన్స్‌క్లబ్ సభ్యులు అవార్డులు అందుకున్నారు. వరంగల్ జిల్లా పాస్ట్ గవర్నర్ పోకల చందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో వైరా లయన్స్‌క్లబ్ మొదటి స్థానంలో ఉందన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న వారికి సేవలందించడానికి ముందుండాలన్నారు. రీజియన్ అడ్వైజర్ పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ మాట్లాడుతూ ఉత్తమ సేవలతోనే సంతృప్తి ఉంటుందన్నారు. బెస్ట్‌క్లబ్ కమిటీ, ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్, డిస్ట్రిక్ట్ క్లబ్ కోఆర్డినేటర్ అవార్డులను క్లబ్ అధ్యక్షుడు చింతోజు నాగేశ్వరరావు అందుకున్నారు. వీడీజీ 1 సీహెచ్ శివ ప్రసాద్, వీడీజీ 2 యారాల ప్రభాకర్‌రెడ్డి, జీఎస్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, జోన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, వెంపటి లక్ష్మీనారాయణ, మోతుకూరి మురళీధరరావు, ఆచవరపు రాఘవరెడ్డి, అమృతవల్లి కోటేశ్వరరావు, నల్లమల ప్రసాదరావు, వనమా విశ్వేశ్వరరావు, నంబూరి మధు, మాదినేని సునీత పాల్గొన్నారు.

సాయినాథుడి పల్లకి సేవ, ఊరేగింపు


ఊరేగింపు ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం సాయిబాబా ఆలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పల్లకి సేవ, సాయినాథుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అభిషేక పూజల అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మారెళ్ల లక్ష్మణ్‌రావు సాయినాథుని పల్లకి సేవను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు కోలాట నృత్యాలతో అలరించారు. గ్రామంలో సాయినాథుడికి ఇంటింటికి టెంకాయలు కొట్టి, కానుకలు సమర్పించుకున్నారు.

ఆరో రోజుకు చేరిన రిలే దీక్షలు


దీక్షా శిబిరంలో స్థానికులు, నాయకులు

కల్లూరు: డబుల్ బెడ్‌రూం గృహాల కేటాయింపులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ తమకు న్యాయం జరిగేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. కాగా, దీక్ష శిబిరంలో ఆదివారం గుండె నొప్పితో కిందపడిపోయిన మహిళ వెంకటనర్సమ్మను గోపాలకుంటలో సోమవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కోటూరి మానవతారాయ్ పరామర్శించి ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావి నాగేశ్వరరావు, దామాల రాజు, భూక్యా శివకుమార్‌నాయక్, షేక్ జానీపాషా, షేక్ బాజీ, ఐ.కృష్ణ, మోరబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలపై అవగాహన

కొణిజర్ల: మండల పరిధిలోని తనికెళ్లలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మానసిక రుగ్మతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మానసిక ఆందోళనను ఏ విధంగా అధిగమించాలనే విషయంపై ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సైక్రియాట్రిస్టు డాక్టర్ సతీష్‌బాబు అవగాహన కలిపించారు. కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, అడ్మీషన్స్ డైరెక్టర్ డాక్టర్ వి చిన్నయ్య, హెచ్ఓడీలు డాక్టర్ ఆయేషా తరుణమ్, సంధ్యారాణి, డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఎర్రుపాలెం: మండలంలోని గ్రామాల్లో ఎండిపోతున్న పంటలకు సాగు నీరు అందించేందుకు గానూ ప్రభుత్వం తక్షణమే నాగార్జున్ సాగర్ జలాలను విడుదల చేయాలని బీజేపీ కిసాన్ ఖేత్ రాష్ట్ర కమిటీ సభ్యులు నూతక్కి నర్సింహారావు, మండల కమిటీ అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. సోమవారం ఈమేరకు మండల తహసీల్దార్ తిరుమలాచారిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల ఆవేదన అర్థం చేసుకుని వెంటనే సాగర్ జలాలను విడుదల చేయాలన్నారు. ఎుప్పాళ్ల చంద్రమౌళేశ్వరరావు, దేవరకొండ కోటేశ్వరరావు, ధనుంజయశర్మ, వేముల రాము, బొల్లయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల దినోత్సవం

తల్లాడ: తల్లాడలో సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా జరిగింది. స్థానిక పెన్షనర్స్ భవనంలో సీనియర్ పెన్షనర్లు దోడ్డా సుసీల, జ్యోతి పుష్ప, శీలం మోహన్‌రెడ్డి, బి.తిరుపతిరెడ్డి, రామకృష్ణారావులను సన్మానించారు. వైరా, ఏన్కూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు టీవీకె సూరి, ఎ.నర్సయ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాట్టేటి సంధ్యారాణి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శరత్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుల రఘుపతిరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ ఎస్‌కె.ఇబ్రహీం, ఎం.కోటేశ్వర్‌రావు, కార్యదర్శి మండపూడి లక్ష్మయ్య, వి.ముత్యాలు, అనసూయ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పాత భవనాలపై పట్టింపేది..?

మండలంలోని గరికపాడులోని పాత పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. భవనం పై భాగాలు మొత్తం పెచ్చులు ఊడటమే కాకుండా భవనంపై మొలిచిన మొక్కలు వృక్షాలుగా పెరిగి అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. కొత్త పంచాయతీ కార్యాలయం నిర్మించి పల్లె పాలన మొత్తం అక్కడి నుంచే నిర్వహిస్తున్నప్పటికీ పాలకులు, అధికారులు శిథిలావస్థలో ఉన్న పాత పంచాయతీ కార్యాలయంపై దృష్టి సారించడం లేదు. స్థానిక ప్రజలు నిత్యం పాత కార్యాలయం వద్ద ఖాళీ సమయంలో సేదతీరుతున్న నేపథ్యంలో ప్రమాదం ఎటు వైపు నుండి వస్తుందో తెలియని దుస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

– వైరారూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : జ్యోత్స్నదేవి, ఎంపీఓ, వైరా
సెల్ నంబర్ : 9704076329